క్లుప్తంగా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్టీపీపీకి చెందిన ఏఈఈ గంగాధర రాజు పేర్కొన్నారు. స్థానిక రామేశ్వరం ఎస్సీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం 10వ తరగతిలో ప్రతిభ కనబరచి 583 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన గురుసుష్మ అనే విద్యార్థినికి రూ.10వేలు నగదు బహుమతి అందచేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు మాట్లాడుతూ తమ పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణత సాధించారని, 33 మంది 500 పైగా మార్కులు సాధించారని, గణితంలో 7 మంది, సోషల్‌లో ఇద్దరు నూటికి నూరు మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు.

వేలం పాటకు స్పందన



సత్రం భూములకు వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని సుంకు వెంకటసుబ్బయ్య సత్రం కార్యాలయంలో గురువారం సత్రం సంబంధించి భూముల బహిరంగ వేలం పాటకు స్పందన లభించింది. సత్రానికి సంబంధించి రామేశ్వరం పొలం, మాలెపాడులో ఉన్న 26 సర్వే నంబర్లలోని 162.17 ఎకరాల భూములకు సంబంధించి 3 ఏళ్ల కాల పరిమితికి ఈ వేలం పాటలో 25 మంది రాగా 14 మంది రూ.10వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొన్నారు. మాలెపాడుకు చెందిన కె.సుబ్బారెడ్డి అనే వ్యక్తి అత్యధికంగా ఏడాదికి రూ.4.75 లక్షలతో లీజు చేజిక్కించుకున్నారు. కాగా గతంలో ఇదే భూమికి ఏడాదికి రూ.2.10 లక్షలు ఉండేది. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహాసింగ్, ఈఓ రామచంద్రాచార్యులు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజశేఖరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా రెవెన్యూ సేవలు



మాట్లాడుతున్న తహసీల్దారు వేణుగోపాల్

అట్లూరు : ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా రెవెన్యూ సేవలు బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్నాయని తహసీల్దారు వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం తహసీల్దారు కార్యలయంలో రెవెన్యూ డే సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కరీముల్లా, వీఆర్ఓలు దస్తగిరి, వెంకటసుబ్బమ్మ, దొరబాబు, జూనియర్ అసిస్టెంటు శక్తికుమార్, టైపిస్టులు బండెయ్య, వేణు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయండి



ఉపాధ్యాయులతో ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేయిస్తున్న రమణారెడ్డి

కలసపాడు : ప్రభుత్వ విద్యారంగానికి తీవ్ర ప్రమాదకారిగా పరిణమించిన జీఓ 117ను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి కోరారు. గురువారం మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల విలీన ప్రక్రియ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ 117ను రద్దు చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తామని మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.శేఖర్‌బాబు, జిల్లా అదనపు కార్యదర్శి ఎస్.వి.సత్యనారాయణ, జిల్లా కమిటీ కన్వీనర్ కె.వి.సత్యనారాయణ, జిల్లా కౌన్సిలర్ కె.శ్రీనివాసులు, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, ప్రసాద్, రాజు, రమణయ్య, ప్రధానోపాధ్యాయుడు కమాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఆర్ఐఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో మౌలిక వసతులు సరిగా లేని జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. ఈ విషయమై గురువారం ఇంటర్ ఆర్ఐఓ వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అల్లా బాష, గంగాధర్, తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

అడుగేస్తే ఆయాసం...కారణం ఊబకాయం....శ్వాస తీసుకునేందుకే కష్టం....కారణం శ్వాసకోశ సమస్యలు. షుగర్, అధిక బీపీ బాధలు. డబ్బు, విలాసాలు అనుభవిస్తూనే ఉన్నా... ఏదో తెలియని దిగులు. ఇతరులను చూస్తే అసంతృప్తి.... ఈ సమస్యలకు కారణం మనసు, శరీరాలే. రెండూ విభిన్నమే అయినా వాటి మధ్య ఏదో లింక్ తెగిన భావన. కలిపే శక్తి, హాయిగా నడిపే శక్తిపేరే యోగా. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవం. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.



యోగా.. ఓ ఔషధం..



యోగాతో నేను అన్న ఆలోచన మనం అనే మహా సముద్రంలో సంయోగం అవుతుంది. యోగం అంటే సంయోగమే. యోగా ద్వారా మనలో పొందిన ప్రేమ, శక్తిని నలుగురితో పంచుకోవాలి. జ్ఞానాన్ని సమాజానికి అందివ్వాలి. స్వీయ ముక్తి, లోక కల్యాణమే యోగా అంతిమ లక్ష్యం. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ చక్కటి ఔషధంగా పనిచేస్తుంది.
- డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు, కడప

ఆరోగ్యయోగం

కడప కల్చరల్: మన సంస్కృతిలో ఆది నుంచి యోగాకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. జన్మస్థలి గనుక మన దేశం ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో సైతం ఆసనాలు వేయిస్తోంది. యోగా ద్వారా ఆరోగ్యాన్ని ప్రపంచమంతా పంచేందుకు 2014లో ఐక్యరాజ్య సమితి అంగీకరించడంతో 177 దేశాలలో యోగా చేస్తున్నారు.

మన యోగా మహాన్

జిల్లాలో యోగా పట్ల ఇటీవల మంచి స్పృహ వచ్చింది. పలు యోగా సెంటర్లు సాధకులతో కళకళలాడుతున్నాయి. కడప నగరంలో మిత్ర యోగా కేంద్రం, విశ్వాత్మ పిరమిడ్ యోగా సొసైటీ, అమ్మవారిశాల, ఆఫీసర్స్ క్లబ్, ఆంజనేయ యోగా కేంద్రం, రామచంద్ర మిషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలలో యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. తర్వాత ప్రొద్దుటూరు, రాజంపేట, బద్వేలు, రాయచోటితో పాటు ప్రస్తుతం దాదాపు అన్ని మండల కేంద్రాల్లో కూడా యోగా, ధ్యాన కేంద్రాలు వెలిశాయి. ప్రత్యేకించి ఓం శాంతి సంస్థ పేరిట బ్రహ్మకుమారీ ఈశ్వరీయా విశ్వవిద్యాలయం సభ్యులు యోగా, ధ్యానం ద్వారా ప్రజల్లో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నారు.

గురువులు–సేవలు

కడప నగరంలో సీనియర్ యోగా మాస్టర్ నామా నరసింహయ్య అమ్మవారిశాలలో పాతికేళ్లుగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, డాక్టర్ కె.కల్పనలు యోగా గురించి విస్తృత ప్రచారం చేశారు. నగర శివార్లలోగల ఆంజనేయ పిరమిడ్ సొసైటీ కూడా పలు సంవత్సరాలుగా శిక్షణ ఇస్తోంది. సీనియర్ యోగా మాస్టర్ సిద్దయ్య, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో వీరభద్రారెడ్డి, హరినాథరెడ్డి యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. కడప నగరంలోని ప్రైవేటు హైస్కూలులో వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులను యోగా రంగంలో జాతీయ స్థాయి బహుమతులను అందుకునేలా తీర్చిదిద్దారు. జిల్లాలో 60 యోగా సెంటర్ల ద్వారా ఏడు వేల మందికి పైగా శిక్షణ పొందుతున్నారు. మొండి వ్యాధులు సైతం నయం అవుతాయన్న నమ్మకంతో యోగా బాట పడుతున్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు యోగా విద్యలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తెస్తున్నారు.

సంగీతం ఓ సముద్రం లాంటిది. ఇందులో ఎంత ఈదినా తనివి తీరదు... అలసట ఉండదు... కవితాత్మకమైన మాటలకు మంచి బాణి కుర్చితే మధురమైన పాట అవుతుంది. మదిని కట్టేస్తుంది. ఆనందంతో ఊపేస్తుంది. పల్లెటూరి దప్పు అయినా.... పండితుని మృదంగం అయినా... ఒక్కేస్టాయిలో మనసును రంజింపజేస్తాయి. కష్టజీవి నుంచి మహా విద్వాంసుని వరకు సంగీతమంటే అందరికీ ఇష్టమే. నేడు ప్రపంచ సంగీత దినోత్సవం. ఈ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

సరిగమ... మధురిమ



కడప నగరంలో సంగీతం నేర్పుతున్న మాస్టారు రామాచారి



సంగీత సాధనలో విద్యార్థినులు

కడప కల్చరల్ : సంగీతం మహా సముద్రం లాంటిది. గురువులు ఎప్పటికప్పుడు ఆ సప్త అక్షరాలతోనే మధురిమలు అందించే రాగాలను సృష్టిస్తారు. మంచి పాట, సంగీతం, మనసుతోపాటు శరీరాన్ని కూడా ఊపేస్తుంది. శ్రమను మరిచే క్రమంలో కష్టజీవి, సంగీతంలో మునిగితేలే పండితుడు దాన్ని ఒకేలా ఆస్వాదిస్తారు. మరికొందరు దీనిని దైవ స్వరూపంగా ఆరాధిస్తున్నారు. పశువును, శిశువును చివరికి విషం చిమ్మే పామును కూడా మైమరిపించే శక్తి సంగీతానికే ఉందంటారు. సంగీతం ఓ మధురమైన లోకం అంటారు.

మన గడపలో...

సంగీత రంగంలో కూడా మన జిల్లా ప్రత్యేకతను చాటుకుంటోంది. మన జిల్లాకు కళల జిల్లాగా గొప్ప పేరుంది. సంగీతం విషయంలో పదకవితా పితామహులు అన్నమాచార్యులు తన కీర్తనలకు కట్టిన బాణీలు నేటికీ సామాన్యులను సైతం ఓలలాడిస్తున్నాయి. మహా కవి పుట్టపర్తి నారాయణాచార్యుల శివతాండవ కావ్యం సంగీత భరితం కావడంతోనే దానికి విశేష కీర్తి ప్రతిష్టలు లభించాయి. గణిత మేధావి లక్కోజు సంజీవరాయశర్మ మంచి వాయులీన విద్వాంసులు. దాన్ని వాయిస్తూ ఎంత క్లిష్టమైన లెక్కకైనా టక్కున జవాబు చెప్పేవారు.

వారి వారసులుగా..

నిన్నటితరం సంగీత కర్తలకు నేటితరం వారు వారసులుగా నిలుస్తున్నారు. శ్రీరామ నవకాంత్, గిరిజ, గువ్వల సుబ్బరాయుడు, టీవీఎస్ ప్రకాశ్, శ్రీవాణి అర్జున్ గాయకులుగా విశేషమైన గుర్తింపు సాధించారు. వీరిలో కొందరు సినిమాల్లో కూడా పాడారు. నేలబొట్ల చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు ఈ రంగంలో కృషి చేస్తున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన యువతి కావ్యచందన, గతంలో ఆరవేటి శ్రీనివాసులు, మునెయ్య జానపద గాయకులుగా పేరుగాంచారు. ఆర్డీ ప్రసాద్‌రావు జిల్లాలో మంచి సంగీత దర్శకుడిగా పేరు పొందారు.

కడప నగరానికి చెందిన యువకుడు వాట్‌కిన్స్ సినిమా సంగీత దర్శకుడిగా, పెంచలదాసు గాయకునిగా రాణిస్తున్నారు. వాయిద్య విభాగంలో తబల సోమయ్య, తబల సుబ్బరాయుడు, గిటారు కళాకారుడు రంజన్, ఆరు తబలాలను ఒకేసారి పలకించగల దిట్ట దండు శ్రీనాథమణి జిల్లాకు ఖ్యాతి తెచ్చారు. ఆయన తబలాపై ప్రత్యేకంగా 'తబలా ఘరానా' పేరిట పెద్ద పుస్తకం రాశారు. కొన్నేళ్లపాటు పుట్టపర్తి సాయిబాబా ఆశ్రమంలో నిలయ విద్వాంసుడిగా పనిచేశారు.

చూపున్న పాట

జిల్లాలో సంగీత పండితుడు సాంబ శివనిధి మరో ప్రపంచం. ఆయన అంధుడైనా విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యంను సైతం తన గానంతో ఆకట్టుకున్నారు. బాలు ఆహ్వానంపై సాంబశివుడు పలు టీవీ, సంగీత కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. జిల్లాకు చెందిన 'బంటి' రుతురాగాలు తదితర ఎన్నో టీవీ సీరియళ్లకు సంగీతం అందించి ప్రముఖుడిగా స్థిరపడ్డారు. పీడీ బాలసుబ్రమణ్యం జిల్లాలో ఆర్కెస్ట్రాకు ఆద్యుడిగా నిలిచారు. ఆయన స్ఫూర్తితో నేడు జిల్లాలో 50కి పైగా ఆర్కెస్ట్రాలు ఏర్పడ్డాయి. గాయకుడు పీఎం రవికుమార్‌బాబు కడప నగరంలో అధునాతన రికార్డింగ్ థియేటర్ ఏర్పాటు చేశారు. బాబ్ అండ్ బాబ్ ఆర్కెస్ట్రా నిర్వాహకులు బాబుతోపాటు మరికొందరు రికార్డింగ్ సెంటర్లతో సంగీత రంగంలో రాణిస్తున్నారు. జిల్లాలో పలువురు సంగీతాజ్ఞులు ప్రత్యేక పాఠశాలల ద్వారా పిల్లలకు సంగీతం నేర్పుతున్నారు.

తీరుమారకుంటే చర్యలు తప్పవు

మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే వరద



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : అవినీతికి ఆస్కారం లేకుండా పనులు చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. పదే పదే చెప్పినా అధికారుల్లో మార్పు రాకుంటే వేటు వేయక తప్పదని హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పనుల గురించి అధికారులతో మాట్లాడారు. కూరగాయల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు జరిగిన పనులు, ప్రభుత్వం నుంచి చెల్లించిన బిల్లుల గురించి సంబంధిత అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన తర్వాతనే పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే చెప్పారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కొనసాగుతాయన్నారు. ఇక్కడ పని చేస్తున్న కొందరి అధికారులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గతాన్ని వదిలేసి ఇప్పటి నుంచైనా నిజాయితీగా పని చేయాలన్నారు. అధికారుల్లో మార్పు రాకుంటే మాత్రం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలను గౌరవించాలని, కూర్చోపెట్టి వారి పనులు చేసి పంపించాలని ఎమ్మెల్యే చెప్పారు. డబ్బు కోసం ప్రజలను పీడించరాదన్నారు. మున్సిపల్ స్థలాలను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించరాదని తెలిపారు. పట్టణంలో శానిటేషన్ మెరుగుపడాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంఈ సాయికృష్ణ, డీఈ రమణ, ప్రభాకర్‌దాస్, ఏఈలు దస్తగిరిరెడ్డి, ఉమా, బ్యూలా, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చెన్నయ్య

గోపవరం : పండ్లతోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో శాఖల వారీగా జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. తాగునీరు, పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కానట్లయితే మరోసారి పరిశీలించి రైతుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాధాకృష్ణన్, ఈఓపీఆర్డీ హసీనా, వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు చంద్రలీల, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి, వక్కలపేట మున్సిపల్ ప్రైమరీ ఉర్దూ స్కూల్ హెడ్ టీచర్ ఎస్. నజీబుల్లా పేర్కొన్నారు. గురువారం నగర సమీపంలోని తమ పాఠశాలలో పిల్లలతో కలిసి మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా మొక్కలను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సల్మా, సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రహమతుల్లా

చాపాడు : ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన కలిగి ఉండాలని మండల అభివృద్ధి అధికారి రహమతుల్లా తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు హైదరాబాదుకు చెందిన నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఫిజియోథెరపీ చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించాలని వారికి ఫిజియోథెరపీ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ అనేది భారతీయ ప్రాచీన వైద్యకల అని దీనిని మనం ఎంత నేర్చుకుంటే అంత ఉపయోగపడుతుందన్నారు. ఫిజియోథెరపీ ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు గుర్తించి భవిత కేంద్రానికి పంపించాలన్నారు. ఇక్కడ వారికి ఫిజియోథెరపీ చేయించటం జరుగుతుందన్నారు. అనంతరం ఫిజియోథెరపీ అవసరాన్ని గుర్తించటం, చేయించటం వంటి వాటిపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ నిర్మల, ఐఈఆర్పీలు గంగాదేవి, ప్రేమకుమారి, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలి

ప్రొద్దుటూరు : మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక నాయకులు గురువారం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించాలన్నారు. ప్రైవేటు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో నిబంధనల మేరకు విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ నాగరాజు, సభ్యులు నారాయణ, మహబూబ్‌బాష, పురుషోత్తం, రసూల్‌బీ ఆదినారాయణ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలికలు రుతుక్రమ సమయంలో వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. శుక్రవారం కడప నగర పరిధిలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో కడప నగరంలోని ఉర్దూ స్కూలులో బాలికలు రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, నాప్కిన్స్ వాడటం, తిరిగి వాడిన వాటిని డిస్పోస్ చేయడం తదితర విషయాలపై తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ , డాక్టర్ నితీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ రకాల విటమిన్ల లోపం కారణంగా విద్యార్థినిలు వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారు.

నీట్ పరీక్షపై సమగ్ర విచారణ జరిపించాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పోరుమామిళ్ల: నీట్ పరీక్ష పట్ల దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరపోగు రవి కోరారు. గురువారం పోరుమామిళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్యానాకు చెందిన పరీక్షా కేంద్రంలో ఏడుగురికి ఫస్ట్ ర్యాంక్ రావడం అందరికీ 720 మార్కులు రావడంతో ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయన్నారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ నిర్వహించిన అన్ని పరీక్షలపై విచారణ జరపాలని కోరారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, తరుణ్, పవన్, ప్రేమ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయవ్యాధి నివారణ



వృద్ధులకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

బద్వేలు అర్బన్ : బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలో వృద్ధులకు, షుగర్ వ్యాధిగ్రస్తులకు బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల కిందట క్షయవ్యాధి వచ్చి తగ్గిన వారు, క్షయవ్యాధి ఉన్న వ్యక్తి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా బీసీజీ టీకాలు వేయించుకోవాలని కోరారు. 2025 సంవత్సరం నాటికి క్షయవ్యాధి రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ నరసింహప్రసాద్, ల్యాబ్ సూపర్‌వైజర్ బ్రహ్మరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు జనార్దన్ రావు, శ్రీరాములయ్య, సీహెచ్‌ఓ జ్యోత్స్న, దీపిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించండి



చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ర్యాలీ చేస్తున్న సీడీపీఓ

రాజుపాళెం : మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి పేర్కొన్నారు. మండలంలోని ఏరువపాళెం, రాజుపాళెం గ్రామాల్లో గురువారం 5 సంవత్సరాలు పైబడిన పిల్లలకు పీర్‌ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య, ఆవశ్యకత, బోధించే విధానం, అంగన్‌వాడీ ఆహార పోషణ గురించి తల్లులకు తెలియజేశారు. అనంతరం వారికి ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు, పలకలు, పెన్సిల్‌లు, కంబాక్సులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, లక్ష్మీదేవి, సుమిత్ర, పార్వతి, ఆయాలు పాల్గొన్నారు.

22 నుంచి భాగవత సప్తాహం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానం శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల సత్సంగ వేదికపై ఈనెల 22 నుంచి వారం రోజులపాటు దేవి భాగవత సప్తాహం నిర్వహిస్తున్నామని శ్రీ బిట్రా పట్టాభిరామయ్య భగవద్గీత సత్సంగం అధ్యక్షులు కె.సుబ్బారెడ్డి తెలిపారు. ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా నంబూరు కాశీవన ఆశ్రమం నుంచి బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త శ్రీనివాస రామానుజదాసు రోజూ దేవీ భాగవతంపై ప్రవచనాలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.